RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 231 | ఆగస్టు 12, 2025 | వెల : రూ.3-00



అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

2లో..



# శిథిలావస్థకు రాజీవ్ స్వగృహాలు..!

- గోడలకు పగుళ్లు, అక్కడక్కడ రాలుతున్న పెచ్చులు
- మరింతగా బీటలు వారితే .. ప్రమాదం పొంచినట్టే
- మరమ్మతులు చేయించాలని ప్రజల వేడుకోలు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలోని భట్టుపల్లి–కడిపికొండ ప్రాంతంలోని రాజీవ్ స్వగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి!. నిరుపేదలు నివాసముండే ఈ ఇండ్లలో ఎప్పుడేమి జరుగుతుందో? తెలియని భయానక పరిస్థితి అయితే నెలకొందని చెప్పొచ్చు. ఇండ్ల గోడలకు పగుళ్లు రావడమే కాదు..అక్కడక్కడ ఇప్పటికే పెచ్చూలుడి పడ్డాయి. ఇక గోడల నుంచి ఇంకొద్దిగా బీటలు వారితే ఆయా ఇండ్లలో ఉండే తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నట్టేనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- పొంచిన ప్రమాదం**

ప్రస్తుత వానాకాలంలో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో కుండపోత వానల వల్ల సదరు బిల్డింగుపైన ప్రభావం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రాజీవ్ గృహాల నిర్మాణాల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు పాటించారనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. గోడలకు పగుళ్ల, బీటలు త్వరగా వస్తుండటం బట్టి చూస్తే.. నామ్ కే వాస్తే నిర్మాణాలు చేపట్టారా? అనే సందేహాలు వస్తున్నాయి. ఆయా హౌజెస్‌లో ఉంటున్న వారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కొందరు సూచిస్తున్నారు. కాగా, భారీ వానలు కురిస్తే గోడలు తడిచి తడిచి బీటలు రావచ్చని, వెంటనే కాంట్రాక్టర్ చేత మరమ్మతులు చేపట్టే విధంగా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు భవనం కూలితే మాత్రమే భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో అధికారులు స్పందించాలని



కోరుతున్నారు. శిథిలావస్థలకు చేరుకున్న రాజీవ్ స్వగృహాల మరమ్మతులకు ప్రాధాన్యతనివ్వాలని వేడుకుంటున్నారు.




## ఇసుక మాఫియా దోపిడిని అరికట్టండి

**- పచ్చిమట్ల రవీందర్ గౌడ్**

**వేద న్యూస్, హుస్నాబాద్ :**

హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుక తక్కువ ధరకు అందించాలని ప్రభుత్వం ఒక ట్రాక్టర్ టిప్పుకు 1400రూపాయలు ఇచ్చేందుకు మైనింగ్ శాఖ కు అనుమతులు ఇవ్వడం జరిగింది. హుస్నాబాద్ పట్టణంలో మొదటి విడతలో 144 ఇండ్లు రావడం జరిగింది. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బేస్మెంట్ లేవల్ వరకు కనీసం మూడు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక అవసరం ఉంటుంది. ఇట్టి ఇసుకకు ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు 6000 రూపాయలు ఇసుక మాఫియా దోపిడీ చేయడం జరుగుతుందని పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. హుస్నాబాద్ చుట్టుపక్కల, పట్టణంలో ఇసుక డంపులు చేసి అధికారుల అండదండలతోనే ఇల్లు కట్టుకునే పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నారు. మంత్రి పొన్నముకు సమీపంగా ఉన్నవారు కూడా ఈ దందాలో పాత్ర ఉన్నట్టు తెలుస్తుంది. వెంటనే ఇట్టి విషయంలో ఆర్డీఓ విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా బి ఎస్ పి పార్టీ పక్షాన కోరడం జరుగుతుంది. లేకపోతే బి ఎస్ పి పార్టీ పేదల పక్షాన ఆర్డీఓ ఆఫీస్ వద్ద ఆందోళన చర్యలు చేపడతామని హెచ్చరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు మారిశెట్టి సుధాకర్ ఎలగందుల శంకర్, జిల్లా ఇన్చార్జ్ దేగల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, హుస్నాబాద్ మండల అధ్యక్షులు దుంద్ర రాంబాబు తదితరులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

**- రాష్ట్ర హౌసింగ్ ఏండి విపి గౌతమ్**

**వేద న్యూస్, హన్మకొండ:**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో వేగం పెంచాలని రాష్ట్ర హౌసింగ్ ఏండి విపి గౌతమ్ అన్నారు. సోమవారం నగరానికి చేరుకున్న ఏండి బల్దియా పరిధి లోని హన్మకొండ వరంగల్ ప్రాంతాల్లో నిర్మాణాలు కొనసాగుతున్న పలు ఇందిరమ్మ గృహాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా రాష్ట్ర హౌసింగ్ ఏండి విపి గౌతమ్ హన్మకొండ పరిధి లోని 31వ డివిజన్ న్యూ శాయంపేట వరంగల్ పరిధి 33 వ డివిజన్ పరిధిలో గల ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని హౌసింగ్ ఎండి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా న్యూ శాయంపేటలో పరిశీలించే క్రమంలో హౌసింగ్ ఏండి మాట్లాడుతూ పిఎంఏవై (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) లో భాగంగా ఓటిపి ,జియో ట్యాగింగ్ నమోదు ఆశాజనకం గా లేదని వేగం పెంచాలన్నారు. ఎస్ ఆర్ ఆర్ తోటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పేమెంట్స్ అకౌంట్లో జమ అవుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఇల్లు మంజూరై ఇప్పటివరకు నిర్మాణం మొదలు పెట్టని వారికి నోటీసులు అందజేసి నిర్మాణం మొదలుపెట్టేలా చూడాలని ఆగస్టు 15 లోగా నిర్మించబోయే ఇళ్లకు మార్కింగ్ ఇవ్వాలని ఆధార్ వెరిఫికేషన్ తో పాటు ఈ ఎం ఈ వై పోర్టల్ లో ఇళ్లకు సమాచారాన్ని నమోదు చేయడం తో పాటు జియో కోఆర్డినేట్స్ తో సమన్వయం చేసుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.

అంతకు ముందు నగరానికి చేరుకున్న రాష్ట్ర హౌసింగ్ ఎండీ నీ మర్యాదపూర్వకం గా కలిసిన బల్దియా కమిషనర్ పూల మొక్కను అందజేశారు.

మిగతా 2వ పేజీలో..

## టిఎంజెఎఫ్ రాష్ట్ర 2వ మహాసభ విజయవంతం చేయండి

**- టిఎంజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లెపాక రాజేష్**

**వేద న్యూస్, హన్మకొండ:**

ఈ నెల 12న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగబోయే తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ (టిఎంజెఎఫ్) రాష్ట్ర 2వ మహాసభను అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బొల్లెపాక రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంఘ బలపాటుకు ఈ మహాసభ కీలకమని పేర్కొన్నారు. జర్నలిస్టుల వృత్తి సమస్యలు, మాదిగ కమ్యూనిటీకి సంబంధించిన హక్కులు, సమస్యల పరిష్కారానికి టిఎంజెఎఫ్ నిరంతర కృషి చేస్తుందని రాజేష్ స్పష్టం చేశారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా ఈ మహాసభ చారిత్రాత్మక నిర్ణయాలకు వేదికవుతుందని ఆయన తెలిపారు. ప్రతి సభ్యుడు, మద్దతుదారుడు చురుకుగా పాల్గొని ఈ మహాసభను విజయవంతం చేసి సంఘ బలాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.



# యూరియా..ఏదయా!

- చెప్పులు లైన్‌లో పెట్టి యూరియా కోసం రైతుల పడిగాపులు
- యూరియా కొరతే లేదని ఓ వైపు ప్రచారాలు.!

**వేద న్యూస్, చందుర్తి :**

యూరియా కొరత లేదని ఒక వైపు అధికారులు ప్రకటనలు చేస్తూ బాగానే ప్రచారాలు చేస్తున్న, మరోవైపు రైతులు యూరియా అందుబాటులో లేక క్యూలో చెప్పులు పెట్టి బారులు తీరుతూ,నానా అవస్థలు పడుతున్న సందర్భాలు కనబడుతున్నాయి. రుద్రంగి మండల కేంద్రంలో అర్ధ రాత్రి వరకు యూరియా కోసం మహిళా రైతులు సైతం క్యూ లైన్ లో నిలబడి యూరియా కోసం పడిన అవస్థలు మరవకముందే, చందుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు తమ చెప్పులను క్యూ లైన్ లో పెట్టుకొని ఎదురుచూస్తూన్న సంఘటనతో జిల్లాలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. సోమవారం రోజున చందుర్తి వ్యవసాయ సహకార సంఘం ముందు వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా బస్తాల కోసం ఉదయాన్నే అక్కడికి చేరుకొని తమ చెప్పులను లైన్ లో వరుసగా పెట్టి యూరియా కోసం నిరీక్షిస్తున్న సంఘటనను చూస్తే, ప్రచారాలకు వాస్తవ పరిస్థితులకు మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. యూరియా లేక రైతులు నానా అవస్థలు పడుతున్న కూడా సరియైన యూరియాను అందించడంలో లోపాలు ఎక్కడ జరుగుతున్నాయో అని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా రైతుల అవసరాలను గుర్తించి ఇదే అదునుగా భావించిన కొందరు ప్రైవేటు ఫర్టిలైజర్ వ్యాపారులు మండలంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని కూడా వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాము ఆరుగలం శ్రమించి వేసిన పంట పైరు చుట్టూ తిరగాలో, లేదా వాటిని కాపాడే క్రమంలో యూరియా బస్తాల కోసం గంటల తరబడి సహకార సంఘాలు, షాపుల చుట్టూ తిరుగుతూ క్యూలో తమ చెప్పులను సైతం ఉంచి నానా అవస్థలు పడాలో, అర్థం కాక దిక్కు తోచని స్థితిలో రైతులు బేంబీలు ఎత్తుతున్నారు.దీనితో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైనదని రైతులు దిగులు చెందుతున్నారు.కావున ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులతో పాటు ప్రభుత్వం స్పందించి యూరియా నిలువలను నిల్వ చేసి రైతులకు అందుబాటులో తెచ్చి యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకొని రైతులను, రైతుల పంట పొలాలను కాపాడవలసిందిగా వారు కోరుతున్నారు.



వేద న్యూస్

మంగళవారం ఆగస్టు 12, 2025

## డ్రైనేజీ, ఇందిరమ్మ ఇండ్ల పనులను

# ప్రారంభించిన కార్పొరేటర్

**వేద న్యూస్, కాజీపేట :**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, 63వ డివిజన్లోని తిలక్ నగర్ లో సైడ్ డ్రైనేజీ, ఇందిరమ్మ ఇండ్లకు 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ సయ్యద్ రజాలి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి మాకు అండగా నిలబడ్డ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే డివిజన్ లో ఉన్న పెండింగ్ పనులను త్వరగా నిధులు ఇచ్చి పూర్తి చేయాలని ఎమ్మెల్యేని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుంటి కుమార్ స్వామి, ఆరూరి సాంబయ్య, 63వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల రాకేష్, పోగుల సంతోష్, క్రాంతి, భరత్ రాజ్, మరియం దాస్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ బిలాల్, 63వ డివిజన్ మైనార్టీ అధ్యక్షులు బిలాల్ కొరేషి, పలపు నవీన్, ఎండి ఇమ్రాన్, కొండ శివ, సయ్యద్ ఆసిఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 36, గృహ నిర్మాణ శాఖకు 26, డీఆర్డీఏ 20, ఉపాధి కల్పన శాఖకు 7, పంచాయితీ, సంక్షేమ శాఖలకు 5 చొప్పున, పౌర సరఫరాల శాఖకు 4, సెస్ కు 3, ఎస్డీసీ, మున్సిపల్ కమీషనర్ సిరిసిల్ల కు 2 చొప్పున, వ్యవసాయ, వైద్యారోగ్య, విద్యా శాఖ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్రాయి 8వ వార్షికోత్సవ వేడుకలు

**వేద న్యూస్, మడికొండ :**



మడికొండ పట్టణంలో విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం కృష్ణపక్షం సోమవారం గ్రామ దేవత (బొడ్రాయి) 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం బొడ్రాయి వద్ద ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం మడికొండ బొడ్రాయి అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్,గౌరవ అధ్యక్షులు తొట్లరాజు యాదవ్, ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ విఘ్నేశ్వరపూజ, స్వస్తివాచనము, స్థలశుద్ధి, క్షీరాభిషేకం జరిపి, మహాదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా తొట్లరాజు యాదవ్ మాట్లాడుతూ గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతాంగం పంటలు సమృద్ధిగా పండి రైతాంగం చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారికి పూజించానన్నారు. అలాగే మడికొండ గ్రామదేవత (బొడ్రాయి) కార్యనిర్వహకులు, కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు బైరి కొమురయ్య, పల్లపు రాజేందర్, అల్లం శ్రీనివాసరావు, పోనగోటి వెంకట్ రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్ కుమార్, నర్మేటి బిక్షపతి గాండ్ల, దువ్వ విజయ్ కుమార్, గున్నాల గౌతం, దండిగం రాజు, జిట్టా చంటి, వస్కుల బాబు, వస్కుల శంకర్, వస్కుల ఆనందం, వస్కుల శీను, వస్కుల భాస్కర్, ఆరూరి మోహన్, పల్లపు అర్జున్, ఈదురు అనిల్ కుమార్, వల్లెపు బాలరాజ్, బొజ్జ శీను హనుమకొండ మల్లికార్జున్, మడికొండ గ్రామ ప్రజలు, పెద్దలు పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన

# మడికొండ బిజెపి నాయకులు

**వేద న్యూస్, మడికొండ :**



బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ను సోమవారం మడికొండ బీజేపీ నాయకులు ఇటీవలే తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు గా ఎన్నికైన రామచంద్రరావు ని హైదరాబాద్ లో ని బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో బీజేపీ వరంగల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ దువ్వ నవీన్ ఆధ్వర్యంలో మడికొండ మండల నాయకులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పిట్టల రమేష్, మండల నాయకులు నార్లగిరి సాయి, అరవింద్, నంగునూరి సాయి చరణ్, సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

## టిఎంజెఎఫ్ రాష్ట్ర మహాసభ పోస్టర్

# ఆవిష్కరించిన సిఐ ప్రవీణ్ కుమార్

**వేద న్యూస్, ధర్మసాగర్ :**



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోతెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ (టిఎంజెఎఫ్) రాష్ట్ర 2వ మహాసభ పోస్టర్‌ను సోమవారం ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మాదిగ జర్నలిస్టులు సంఘటితంగా ముందుకు సాగుతూ వృత్తి పరంగా నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. జర్నలిజం సామాజిక బాధ్యత కలిగిన వృత్తి అని,ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఎంజెఎఫ్ ధర్మసాగర్ మండల ఇంచార్జ్ హన్మకొండ ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు పృథ్వీరాజ్, మాథ్యూ, రణధీర్,స్టీఫెన్,చిట్యాల రమేష్,అనిల్,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి,వరి పంటల పరిశీలన

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి, నర్సక్కపేట మరియు పొత్తూరు గ్రామములో రైతులు సాగు చేస్తున్న ప్రత్తి వరి పంటలను పరిశీలించడం జరిగింది. అంతేకాకుండా ప్రత్తిలో ఆకుమచ్చ రసం పీల్చే పురుగుల ఉద్ధృతిని గుర్తించడం జరిగింది. ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు ప్రోఫీకోనజోల్ 200 ఎం.ఎల్ ఎకరానికి పిచికారి చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు అసిఫేట్ 1.5 గ్రా/లీటరు లేదా ఇమిడాక్లాప్రైడ్ 0.3 మి.లీ./ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అదే విధంగా వరిలో ప్రధానంగ వచ్చే మొగి పురుగు లక్షణాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. మొగి పురుగు నివారణకు చేపట్టవలసిన చర్యలను తెలియజేయడం జరిగింది. నారుమడి లో మరియు పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే మొక్కలు ఎండి చనిపోతాయి. మోగి పురుగు లక్షణాలు, ముదురు గోధుమ,ఎ%శీ%డుగడ్డి, పసుపు రంగులో ఉన్న ఆడ పురుగుల ముందు జత రెక్కల పై నల్లటి మచ్చ కలిగి వుంటాయి.తెలుపు గోధుమ రంగు లో వుండే పిల్ల పురుగులు (లార్వా) ఎదిగిన తరువాత నారింజ పసుపు రంగు తల కలిగి వుంటుంది. నారు పీకే 7 రోజుల ముందు 2 గుంటల నారు మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గులికలను చల్లి నీటిని ఆ మడిలోనే ఇంకెట్లు చేయాలి. ముదురు నాటు నాటేటప్పుడు నారు కొనలను త్రుంచి వేయాలి. నాట్లు వేసిన 10 నుండి 15 రోజులలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఏకరానికి 10 కిలోల చొప్పున లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరా%శీ%త్రనిలిప్రోల్ 0.4 జి గుళికలు 4 కిలోల చొప్పున చల్లుకోవాలి. చిరు పొట్ట దశలో ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్.పి. 400 గ్రా/ ఎకరాకు లేదా క్లోరంత్రనిలిప్రోల్ 60 మి. లి/ఎకరాకు పిచికారి చేసుకోవాలి. అలాగే మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ 80 మి.లీ. మందుని ఒక ఎకరానికి పిచికారి చేయాలి. ఈ క్షేత్ర సందర్శనలో భాగంగా వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త హెడ్ డా. బి. రామ్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు ప్రత్తి, వరి మొక్కజొన్న పంటలలో రెండవ దఫాలో యూరియాకి నానో యూరియా వాడుకోవచ్చని తెలియజేశారు.ఈ సందర్శనలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా. బి. హరికృష్ణ మరియు శాస్త్రవేత్త డా. కె. మదన్ మోహన్ రెడ్డి. వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డా .ఉషా రాణి.మండల వ్యవసాయ విస్తరణ అధికారి అర్చన,లలిత మరియు రావేప్ విద్యార్థులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,హౌసింగ్ పి డి సిద్దార్థ నాయక్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, డిఈ రవీందర్, తహసీల్దార్ బావు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేత

**వేద న్యూస్, చొప్పదండి :**



చొప్పదండి అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు వడ్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ పూర్తి చేయుటకు మిగిలి ఉన్న పనులకు నిధులు మంజూరు చేయడం గురించి చొప్పదండి శాసన సభ్యులు డా.మేడిపల్లి సత్యం కి వినతి పత్రం అందచేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల అధ్యక్షులు కడారి గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి కళ్ళేపల్లి అరవింద్, మాజీ కౌన్సిలర్ కొత్తూరి మహేష్, పట్టణ కోశాధికారి కొత్తూరి దినేష్, తోడేటి రత్నం, కళ్లేపెల్లి కనకయ్య, కనకం శ్రీనివాస్, కొత్తూరి ప్రేమ్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం దొంగ అరెస్ట్

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో నీరటి శ్రీనివాస్ ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించగా, దర్యాప్తులో భాగంగా సోమవారం నేరస్థుడైన బానోతు తిరుపతి పట్టుకొని నేరస్తుని దగ్గర నుండి బండిని రికవరీ చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# హామీలు అమలు చేయాలి



**వేద న్యూస్, చొప్పదండి రామడుగు :**

గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఆంతకు ముందు కార్యకర్తలు స్థానిక పోచమ్మ చౌరస్తా నుండి మండల అభివృద్ధి కార్యాలయం వరకు ర్యాలీ గా వెల్లారు. అప్పటికే అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అధికారి అందుబాటులో లేక పోవడతో అక్కడే బైఠాయించారు. అనంతరం వచ్చిన ఎంపిడిఓ కు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ యాదవ్ మాట్లాతూ పాలకులు ఇచ్చిన ఆరు గ్యారంటీ ల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు ఇరవై ఐదు వందల జీవన భృతి మొదలు ఇందిరమ్మ ఇండ్ల వరకు కాగితాల నుండి కదడం లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోడీ రవి, ఒంటెల కరుణాకర్ రెడ్డి, కట్ట రవీందర్, రామ్, లక్ష్మన్, పూరెళ్ళ శ్రీకాంత్, బండ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం అక్రమలపై
# విచారణ జరిపించాలి

**వేద న్యూస్, ఇల్ల%శీ%తకుంట:**



గత కొంతకాలంగా ఇల్లంతకుంట సహకార సంఘలో అక్రమాలు జరుగుతున్నాయని పలుమార్లు పై అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని గత కొన్ని సంవత్సరాలుగా సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు సెంటర్లో అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై పూర్తి విచారణ చేసి దోషులను శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య డిమాండ్ చేశారు. గత రెండు మాసాల క్రితం సహకార సంఘం కొనుగోలు మరియు వచ్చిన కమిషన్ మరియు గన్ని బ్యాగుల సమాచారం పై జిల్లా పౌరసరఫరా శాఖ అధికారికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా వారు ఇచ్చిన సమాచారాన్ని చూస్తే గత మూడు సంవత్సరాల కాలంలో సుమారు 80 లక్షల పైచిలుకు రూపాయల గన్ని బ్యాగ్ షార్ట్ ఏజ్ చూపిస్తూ లక్షలాది రూపాయలు మాయం చేశారని ఆయన అన్నారు. ప్రతి సెంటర్లో సుమారు ముగ్గురు నుండి ఐదుగురు సిబ్బంది పని చేస్తారని ఆ పని చేసే తాత్కాలిక ఉద్యోగులు వడ్ల కొనుగోలు సెంటర్లో ఏదైనా గన్ని గాని బ్యాగులు కానీ టల్ఫిన్ కవర్లు కానీ కాంట బాట్లు కానీ దొంగిలించబడితే వారి జీవితం నుండి రికవరీ చేసిన తర్వాతనే మిగతా వారి జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరి ఇంత పకడ్బందీగా పనిచేసే సిబ్బంది ఉన్నప్పుడు యిన్ని లక్షల విలువ చేసే గన్ని ఎలా మాయమైందో దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక గన్ని బ్యాగు లెక్క చూసుకుంటేనే లక్షలాది రూపాయలు మాయమయ్యాయని ఇంకా మిగతా ఫెర్టిలైజర్ గానీ సిబ్బంది వేతనాలు కానీ కొనుగోలు సెంటర్లో ఇంకా ఎన్ని గోల్మాల్ జరిగాయో చెప్పనవసరం లేదని ఆయన అన్నారు. గత ఏడు సీజన్లకు సంబంధించి సమాచారం మాత్రమే వచ్చిందని మిగతా సమాచారం ఆ%శీ%డర్ ప్రాసెస్ లో ఉందని అధికారులు చెప్పడం జరిగింది పూర్తి సమాచారం వచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్ మరియు సహకార రాష్ట్ర కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా సహకార జిల్లా అధికారులు స్పందించి ఇల్లంతకుంట సహకార సంఘం లో జరుగుతున్న అక్రమాలపై పూర్తి విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సహకార సంఘం ముందు రైతులతో ధర్నా కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.

# ఆర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

**వేద న్యూస్, పెద్దపల్లి :**



**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి జిల్లాలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఆవునూరి పద్మ తమ ఇండ్లు శిథిలావస్థలో ఉందని తమకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త రామన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలకుర్తి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన రామ్మోహన్ రావు సర్వే నెంబర్ 503 లోని ప్రభుత్వ భూమిలో పంపు కట్టారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవో కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ :**




నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ నులిపురుగుల మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా లక్ష 98 వేల మంది బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. ఒక సంవత్సరం నుండి 2సం.లు ఉన్న చిన్నారులకు భోజనం తరువాత అల్బెండజోల్ సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల విద్యార్థులకు అల్బెండజోల్ ఒక మాత్ర భోజనం అనంతరం అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నులి పురుగుల వల్ల ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తహీనత తదితర అనారోగ్య రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మాత్రలను తీసుకోవడం వల్ల రక్తహీనతను నిర్మూలించడంతో పాటు పోషకాహార ద్వారా వ్యాధినిరోధక శక్తిని మెరుగుపడుతుందని కలెక్టర్ కు తెలిపారు. ముఖ్యంగా ఈ నులిపురుగులు అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల నులి పురుగులు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. ఒకవేళ ఈ రోజు పొరపాటున సదరు మాత్రలు తీసుకొని వారికి మరల ఆగస్టు 18వ తేదిన మాప్-అప్ కార్యక్రమం ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. జ్వరం ఉన్నపుడు ఈ మాత్రలను తీసుకోకూ డదన్నారు. అనంతరం ధర్మారం అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి చిన్నారులకు స్వయంగా అల్బెన్డజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డిడబ్ల్యూ ఓ రాజమణి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్, కొమురయ్య,తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపిడిఓ శ్రీనివాస్, డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ సభ్యుల ప్రమాణస్వీకారంలో ప్రభుత్వ విప్



**వేద న్యూస్, పార్వతిపురం మన్యం జిల్లా ప్రతినిధి :**

కురుపాం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్ ల ప్రమాణ స్వీకార మహోత్సవములో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో పిఎసిఎస్ అధికారులు చైర్మన్, డైరెక్టర్ లతో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారికి కావలసిన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేటట్లు చెయ్యాలని సూచించారు. కురుపాం పిఎసిఎస్ చైర్మన్ గా డొల్లు కిషోర్ కుమార్, డైరెక్టర్లుగా తంగుడు సత్యనారాయణ, కర్రి సత్యంనాయుడు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద కొమరాడ టిడిపి నాయకులు బత్తిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**



కురుపాం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీని మూలిగూడ జంక్షన్ నుండి కురుపాం మండల కేంద్రంలో గల ధూళికేశ్వర స్వామి ఆలయం వరకు రైతులు వారి సొంత ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు 7000 చొప్పున మూడు విడతల్లో సంవత్సరానికి రూ. 20,000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# త్వరలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**వేదన్యూస్ డెస్క్ :**

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి బెంగళూరుకు వచ్చాను అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బెంగళూరులో ఆయన మూడు వందేభారత్ రైళ్లు, మెట్రో ఎల్లో మార్గాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయంలో బెంగళూరు కూడా భాగస్వామి అని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. మౌలిక సౌకర్యాలు మరింత అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టామని అన్నారు. మౌలిక సౌకర్యాల కల్పనలో బెంగళూరు రోల్‌మోడల్‌గా నిలిచిందని కొనియాడారు. ప్రపంచంలో భారత్ మూడో అతి పెద్ద మెట్రో నెట్‌వర్క్ కలిగి ఉందని తెలిపారు.

# భారీ ట్రాఫిక్ జామ్ - అంబులెన్స్‌లోనే పోయిన ప్రాణం..!

**వేదన్యూస్ డెస్క్ :**



అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. మహారాష్ట్రలోని ముంబయి సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పాల్‌ఘర్ జిల్లాకు చెందిన ఛాయా పూరవ్ (45) అనే మహిళ మరణం అటు ఆ జిల్లాలోని ఆరోగ్య వసతుల దుస్థితినీ, ఇటు ముంబయి మహానగరానికి అనుసంధానించే ఎన్‌హెచ్‌- 48పై ట్రాఫిక్ పరిస్థితినీ ఒకేసారి ఎత్తిచూపింది. వివరాల్లోకి వెళితే... తమ ఇంటికి సమీపంలో చెట్టుకొమ్మ విరిగిపడటంతో ఛాయ్ పూరవ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆమె పక్కటెముకలు, భుజాలు, తల భాగంలో గాయాలయ్యాయి. దీంతో అక్కడ ట్రామా సెంటర్ లేకపోవడంతో స్థానిక ఆసుపత్రి సిబ్బంది ఆమెను ముంబయిలోని హిందుజా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. 100 కి.మీ.ల దూర ప్రయాణానికి సాధారణంగా 2.5 గంటల సమయం పడుతుందన్న ఉద్దేశంతో ఆమెకు అనస్థీషియా ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం 3గంటల సమయంలో అంబులెన్సులో బయల్దేరగా.. ఎన్‌హెచ్‌-48లో భారీ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయారు. దీంతో సాయంత్రం 6గంటల వరకు కేవలం సగం దూరం మాత్రమే చేరుకోగలిగారు. ఈ నేపథ్యంలో ఆమెకు అనస్థీషియా ప్రభావం తగ్గడంతో విపరీతమైన నొప్పి భరించలేక విలవిల్లాడిపోయారు. ఈ క్రమంలో తక్షణ వైద్య సాయం అందించేందుకు అంబులెన్స్ సిబ్బంది రాత్రి 7 గంటల సమయంలో మీరా రోడ్‌లోని ఆర్బిట్ ఆసుపత్రికి (హిందుజా ఆస్పత్రికి 30కి.మీ.ల దూరంలో) తీసుకెళ్లారు. కానీ అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఆమెను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు. కనీసం 30 నిమిషాల ముందు ఆస్పత్రికి తీసుకొచ్చి ఉంటే కాపాడేవాళ్లమని ఆమె భర్త కౌశిక్‌కు తెలిపారు.

వేద న్యూస్

మంగళవారం ఆగస్టు 12, 2025


# కదం తొక్కిన "ఆటో కార్మికులు"

**- ఉచిత బస్సు పేరుతో మా పొట్ట కొట్టొద్దు - సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్**

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి :**




పార్వతీపురం,గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జిఎం వలస, సీతానగరం మండలాలకు చెందిన వందలాది మంది ఆటో కార్మికులు పార్వతీపురం చేరుకొని,పార్వతీపురం పాత బస్టాండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి వై మన్మధరావు, బి వి రమణ,కోశాధికారి గొర్లి వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తుందని ఈ పథకం అమలైన తర్వాత ఆటో కార్మికులలో 60 శాతం మందికి ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రవేశపెట్టినపుడు దాని ప్రభావం వలన ఎంతమందికి నష్టం జరుగుతుందో కూడా పరిశీలించి శాస్త్రీయంగా నష్ట పరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి లేక ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులలో ఉన్నారని ఈ నేపథ్యంలో ఈ ఉచిత బస్సు పథకం పెట్టిన తర్వాత ఇంకా ఆటో ,టాక్సీ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి నెల పెన్షన్ చెల్లించాలని, వాహన మిత్ర తరహా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఏడాదికి 25 వేల రూపాయలు పరిహారం చెల్లించాలని, ఇప్పటికే వాహనాలపై తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆటో, టాక్సీ డ్రైవర్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యచరన రూపొందించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, కె సాంబమూర్తి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు సంబాన చిన్న,డి రాము, క్రాంతి, నారాయణ సత్యనారాయణ, జి శ్రీను, శంకర్రావు, పోలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# వీడియో కాన్ఫరెన్స్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జరిపిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో భాగంగా జిల్లాలో జిల్లాకు సంబంధించి జరిపిన అన్ని రకాల వాహనాల కేసుల గురించి జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మరియు మోటార్ వాహన తనిఖీ అధికారి వంశీధర్ కార్యాలయ నిర్వాహకురాలు కల్పన వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. అందులో జిల్లా నుంచి మొత్తం 293 కేసులు రాయడం జరిగిందన్నారు. అందుకుగాను రాష్ట్ర రవాణా శాఖ వారు నిర్ణయించిన 64 లక్షల రూపాయలు 100శాతంగా నియమించారు. దీనికి గాను టాక్స్ మరియు పెనాల్టీ కాంపౌండింగ్ ఫి ద్వారా మొత్తంగా 96,96,465 టాక్స్ ఫెనాల్టీ రూపేణా 151 శాతంగా వసూలు చేశామని మని తెలిపారు. అలాగే ఇంకా టాక్స్ కట్టని సరుకు రవాణా వాహనాలు ట్రాక్టర్ ట్రైలర్ ఇతర వాహనాలు 5088 వాహనాలు ఉన్నట్టు. ఈ వాహనాలు మీ స్వంతంగా టాక్స్ కట్టుకుంటే ఎలాంటి పెనాల్టీ లేకుండ కట్టాల్సి ఉంటుంది అదే రవాణా శాఖ అధికారులు పట్టుకుంటే 200 శాతం ఫైన్ తో కట్టాల్సి ఉంటుందని. సరుకు రవాణా వాహనాలు తప్పని సరిగా భీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే పదిహేను సంవత్సరాలు పూర్తి ఐన స్వంత పనులకు వాడే ద్విచక్ర వాహనాలు, స్వంత కార్ లు విధిగా గ్రీన్ టాక్స్ వాహన భీమా వాహన కాలుష్య పత్రాలతో మీ స్వంత వాహనాలను పురుద్దరణ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి తెలిపారు .పై విషయాన్ని రాష్ట్ర రవాణా కామిషనర్ సురేంద్ర మోహన్ కి తెలియజేశారు.

# రైతులకు కావలసిన ఎరువులు సరఫరాచేయాలి

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమండ్**

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి :**



ఎరువులు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్లో బస్తా 450 రూపాయల అధిక ధరలకు కొనుగోలు చేస్తూ అవసరం లేని ఎరువులను, పురుగు మందులను రైతుకు అంటగడుతూ అధిక వ్యయ భారాన్ని రైతుపై మోపడమే కాకుండా భూసారాన్ని దిగమింగే పురుగుమందులను అంటగట్టడాన్ని నివారించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తో కూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ భామిని మండలంలో రైతులకు కావలసిన ఎరువులను ప్రైవేట్ డీలర్ల నుండి అధిక భారానికి కొనకోవాల్సి వస్తున్నదని, ప్రైవేట్ డీలర్లు పక్కనే ఉన్న ఒరిస్సా రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తూ అధిక ధరలకు అమ్ముకుంటూ ఆంధ్ర రైతులకు అన్యాయం చేస్తున్నారు కావున విచారణ జరిపించి తగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కావలసిన ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా సరఫరా చేయాలని, జిల్లా రైతులను ప్రైవేటు వర్తకుల బారి నుండి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈవి నాయుడు,భామిని మండలం కార్యదర్శి కొత్తకోట బాబురావు నాయుడు,బుడితి మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండలం రంగంపేట జంపన్న చెరువు వద్ద గంజాయి విక్రయానికి వచ్చిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మలవాత్ రామ్‌కుమార్ నాయక్ (27, నిజామాబాద్), బానోతు అజయ్‌కుమార్ (26, వీర్నపల్లి), అజ్మీర సాయి విశాల్ (27, వీర్నపల్లి) నిజామాబాద్ పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, కొంత తాగి మిగతా గంజాయిని ఎక్కువ రేటుకి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది. పోలీసులు 50 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్‌లో నిందితులను పట్టుకొని, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ దర్యాప్తు పూర్తి చేశారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

# ప్రజలకు ఒక'లా'..పైరవీకారులకు మరొక'లా'!

- తహశీల్ ఆఫీసులో జనం సమస్యలపై పట్టింపేది?
- తమ గోడు పట్టించుకోవడం లేదని మండలవాసుల ఆవేదన
- సామాన్యులకు దూరంగా కార్యాలయం మారిందని ఆరోపణలు




**వేద న్యూస్, బెజ్జంకి:**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తహశీల్దారు కార్యాలయంలో పైరవీకారులు రాజ్యమేలుతున్నారని ప్రజలు వాపోతున్నారు. వివిధ రకాల అవసరాల నిమిత్తం తహశీల్ ఆఫీసుకు వచ్చే రైతులను, సామాన్య ప్రజలను పట్టించుకునే వారు ఆఫీసులో కరువయ్యారని, తహశీల్దారును కలిసే క్రమంలో అసలు అటెండర్ పాత్ర లేదా.. ఆయన ఎక్కడ? అని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.తహశీల్దారు కోసం ఆఫీసుకు వస్తే పడిగడుపులు కాయాల్సిందేనని తమను లోపలికి పంపే నాథుడే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో సామాన్యులు, రైతుల విషయంలో తహశీల్ ఆఫీసులో ఇలా వ్యవహార సరళి ఉంటే..పేరు, పలుకుబడి ఉన్న పైరవీకారులు మాత్రం సరాసరి ఎవరి అనుమతి లేకుండా నేరుగా ఎమ్మార్వో కార్యాలయంలోకి వెళ్లి, తమ పనులను చేసుకొని దర్జాగా బయటికి వస్తున్నారు. పనుల నిమిత్తం వచ్చిన తమకు మాత్రం పడిగాడుపులే మిగులుతున్నాయని రైతులు, సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు తహశీల్దారు ఆఫీసులో అడ్మినిస్ట్రేషన్ ఉందా? లేదా? అని అడుగుతున్నారు.

తహశీల్దారు కార్యాలయంలో రైతులు, సామాన్యులను ఒక'లా', పైరవీకారులను మరో'లా' చూస్తూ, ద్వంద్వ వైఖరిని ప్రదర్శించడం పట్ల సామాన్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి తహశీల్ ఆఫీసులో జరిగే కార్యకలాపాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. తహశీల్దారు సైతం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని, వారితో మాట్లాడాలని జనం అంటున్నారు. తహశీల్ ఆఫీసులో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ ఉద్యోగులపై తగు చర్యలు తీసుకొని, ఆఫీసులో పరిస్థితులు చక్కదిద్దాలని మండలవాసులు రిక్వెస్టు చేస్తున్నారు.

# ఇజ్రాయిల్ మారణహోమంపై చర్య తీసుకోండి

**వేదన్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ సమాజం తన బాధ్యతను నిర్వర్తించి గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై చర్య తీసుకోవాలని పాలస్తీనా విదేశాంగ మంత్రి వర్సేన్ అహాబెకియాన్ షాహిన్ కోరారు. ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశానికి ముందు ఆమె అల్ జజీరా ఛానల్‌తో మాట్లాడారు. గాజా నగరంపై పట్టు బిగించేందుకు హమాస్‌తో యుద్ధాన్ని మరింత ముమ్మరం చేయాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై చర్చించేందుకు ఐరాస భద్రతా మండలి సమావేశమవుతోంది. ఈ నేపథ్యంలో.. అంతర్జాతీయ చట్టాన్ని, అంతర్జాతీయ మానవతా చట్టాన్ని అనుసరించి ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని షాహిన్ భద్రతా మండలికి విజ్ఞప్తి చేశారు. గాజా సిటీని హస్తగతం చేసుకోవాలన్న ఇజ్రాయిల్ ప్రణాళికపై పలు ప్రపంచ దేశాల నేతలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరుస్తున్న సంగతి తెలిసిందే. అమెరికా ఇప్పటికే ఇజ్రాయిల్‌కు దౌత్యపరమైన, సైనిక సహకారాన్ని అందిస్తోందని షాహిన్ గుర్తు చేశారు. సమస్యకు పరిష్కారం కనుగొనాలని అమెరికా చెబుతోందని, అయితే ఏ చర్య తీసుకున్నప్పటికీ పాలస్తీనా హక్కులను విధిగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. పాలస్తీనా హక్కులను గౌరవించని పక్షంలో ఇజ్రాయిల్-పాలస్తీనాలో కానీ, మధ్యప్రాచ్యంలో కానీ, ఆ మాటకొస్తే ప్రపంచంలో కానీ శాంతి నెలకొనబోదని చెప్పారు. గాజా భవిష్యత్ పాలనపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ చేసిన వ్యాఖ్యలపై షాహిన్ మండిపడ్డారు. తమను ఎవరు పరిపాలించాలో నిర్ణయించుకోవాల్సింది పాలస్తీనియన్లేనని తేల్చి చెప్పారు. గాజాలో ఇప్పుడు ఉన్న చట్టబద్ధమైన, రాజకీయ సంస్థ పీఎల్ఓ మాత్రమేనని తెలిపారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సైనికులు, సెటిలర్ల దాడులపై చర్యలు చేపట్టడంలో అంతర్జాతీయ సమాజం విఫలమైందని విమర్శించారు.

# తుర్కియేలో భారీ భూకంపం

**వేదన్యూస్ డెస్క్:**

తుర్కియేలోని బలికెసిర్ ప్రావిన్సులో ఆదివారం సాయంత్రం 6.1 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. దీనివల్ల 200 కి.మీ. దూరంలోని ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రతతో ఇస్తాంబుల్, బలికెసిర్, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రకంపనలు వచ్చాయి. పలు సిటీల్లో భవనాలు కుప్పకూలాయి. ప్రజలు ప్రాణభయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. భూకంప కేంద్రం బలికెసిర్ సిటీకి 51 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో ఏర్పడినట్టు అధికారులు ప్రకటించారు. సిందిర్గి పట్టణంలో దాదాపు 16 భవనాలు కూలిపోయినట్లు స్థానిక మీడియా పేర్కొంది. శిథిలాల కింద చిక్కుకొని ఓ యువతి మృతిచెందిందని అధికారులు తెలిపారు. భూకంపం ధాటికి 29 మందికి తీవ్రగాయాలయ్యాయి. శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ సిబ్బంది కృషి చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకూ ప్రాణనష్టం జరిగినట్టుగా ఎలాంటి సమాచారం అందలేదని, ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తుర్కియే ప్రభుత్వం వెల్లడించింది

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073